ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే మజ్లిస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో వివిధ పార్టీల నుంచి వచ్చిన వారిని ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలు విని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గోల్కొండ, టోలిచౌకీ, కార్వాన్ తదితర ప్రాంతాల్లో అసంపూర్తి పనులపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వరద నీటి పైప్‌లైన్ పనులు గత సంవత్సర కాలంగా జరుగుతున్నాయని, ఈ వేసవిలో ఆ పనులు పూర్తి అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్టు కావడంతో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ పనులు జరుగుతున్నాయన్నారు. వరద నీటి ముంపును నివారించడానికి ఈ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో వీడీసీసీ రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున 2 నెలల పాటు పనులు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయన్నారు. వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నానని చెప్పారు. కార్వాన్ నియోజకవర్గంలో రూ.297 కోట్ల తో డ్రైనేజీ పనులు ఈ నెలలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రారంభిస్తారన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఈ పనులు జరుగుతున్నాయని పాత కాలం నాటి డ్రైనేజీ స్థానంలో అధునాతన డ్రైనేజీ లైన్‌లు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు టోలిచౌకీ, నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్‌లో వరద ముంపు నివారించడానికి డ్రైనేజీ బాక్స్ టైప్ పనులు పూర్తి అయ్యాయని ఆయన అన్నారు. దీన్ని వల్ల టోలిచౌకీ చౌరస్తా, నిజాం కాలనీ, నదీమ్ కాలనీ తదితరర ప్రాంతాలకు వరద నీటి ముంపు శాశ్వతంగా పరిష్కరించబడుతుందన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మిర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులున్నారు.

'మహా శివరాత్రి జాగరణ్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం'


మాడిశెట్టి సదానందం గుప్తాను సత్కరించిన దృశ్యం

అబిడ్స్: రహింపురా సత్తన్న గల్లీ జాగరణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మహా శివరాత్రి జాగరణ్ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని జాగరణ్ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా పేర్కొన్నారు. ఆదివారం జాగరణ్ సేవా సమితికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మాడిశెట్టి సదానందం గుప్తా మాట్లాడుతూ..ఈ సంవత్సరం మహా శివరాత్రి జాగరణ్ వేడుకలు కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా జీఎస్.ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాజన్‌కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శిగా పి.రంజిత్‌కుమార్, కోశాధికారిగా బి.లక్ష్మీనారాయణ వర్మ, రాజేందర్ సింగ్‌లు, ఉపాధ్యక్షులుగా తోట శ్రవణ్‌కుమార్, నవీన్ సింగ్, ప్యాట రాజ్‌కుమార్, జనగామ పాండు, తాడిశెట్టి నవీన్‌కుమార్, బూడిద రాజేందర్, లక్ష్మీనారాయణ, భాగేష్ సింగ్, నర్సింగ్‌రావు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో అందరి సహకారంతో జాగరణ వేడుకలు చూడముచ్చటగా చేపడుతామని సదానందం గుప్తా తెలిపారు.

ముదిరాజ్‌లను 'బీసీ-ఏ'లో చేర్చాలి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శివ ముదిరాజ్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లను వెంటనే 'బీసీ-ఏ'లో చేర్చాలని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో 60 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్‌లు విద్య, ఉద్యోగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. రిజర్వేషన్ అమలులో జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో తెలంగాణ ముదిరాజ్‌లు అంతా కాంగ్రెస్ వైపు నిలబడి అధికారంలోకి తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి ఉదయ్‌కుమార్, బ్రహ్మం సురేష్ ముదిరాజ్, నీలం సైదులు, వెంకటేష్, గిరి ముదిరాజ్, ప్రేమ్‌లత ముదిరాజ్, సాయికిరణ్ ముదిరాజ్, బాను ముదిరాజ్ పాల్గొన్నారు.

'వీఆర్‌ఓ వ్యవస్థను కేసీఆర్ ప్రభుత్వం నాశనం చేసింది'


కోదండరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గోల్కొండ సతీష్ తదితరులు

అబిడ్స్: రెవెన్యూ శాఖకు వెన్నెముక లాంటి వీఆర్‌ఓల వ్యవస్థను మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం నాశనం చేసిందని తెలంగాణ వీఆర్‌ఓల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్ పేర్కొన్నారు. 18 ఏళ్లుగా ప్రమోషన్లు, సీనియార్టీలు లేకుండా విధులు నిర్వహిస్తున్న తమను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నానా కష్టాలు పెట్టిందన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ధరణి రీఫార్మ్స్ సభ్యులు కోదండరెడ్డిని వినతి పత్రం అందజేశారు. అనంతరం గోల్కొండ సతీష్ మాట్లాడుతూ..గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన వీఆర్‌ఓల వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్‌ఓలైన తమను కేసీఆర్ ప్రభుత్వం ఇతర శాఖలకు బదిలీ చేసి రెవెన్యూ శాఖలో ధరణి వ్యవస్థను తీసుకువచ్చి భ్రష్టు పట్టించిందన్నారు. ధరణి కారణంగానే భూ తగాదాలు ఎక్కువయ్యాయన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చే విధంగా వీఆర్‌ఓలు కృషి చేస్తారని, తమకు న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్: వీకెండ్ అయిన ఆదివారం పాతబస్తీలో సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతబస్తీలోని పర్యాటక స్థలాలు సందర్శకులతో కిటకిటలాడాయి. తమ కుటుంబ సభ్యులతో కలిసి పాతబస్తీలోని చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్,జూ పార్కు,నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. పత్తర్‌గట్టి–గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ రోడ్డులో యథావిధిగా ట్రాఫిక్ జామ్ తప్ప లేదు.

ప్రొఫెసర్ వేదాచలంకు ఘన నివాళి


సంస్మరణ సభలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సుల్తాన్‌బజార్: ప్రగతి మహా విద్యాలయం ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన సమయంలో దివంగత ప్రొఫెసర్ ఎన్‌టీ వేదాచలం విద్యార్థులకు గొప్ప మార్గదర్శకాలను చూపించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసిన గొప్ప విద్యావేత అని పూర్వ విద్యార్థులు ప్రకాష్‌కుమార్ గుప్తా, బంగారు సుధీర్‌కుమార్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ విజయనిర్మల, జి.రమేష్ పేర్కొన్నారు. ఆదివారం హనుమాన్ టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయంలో డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రొఫెసర్ ఎన్‌టీ. వేదాచలం సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వేదాచలం జనవరి 12న కన్నుమూశారని దీంతో కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా ఆయన సంస్మరణ సభ నిర్వహించారన్నారు. పూర్వ విద్యార్థులు దేవిక బట్నాగర్, సీనియర్ జర్నలిస్టులు జి.రమేష్, శ్రీనివాస్, అమరేందర్, మధు, సంజీవ్ మిశ్రా, విమల్ షా, స్వామియాదవ్, రాకేష్ అగర్వాల్, ప్రొఫెసర్లు వైకేఎం.నాయుడు, విశ్వనాథం, చెన్నప్ప, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..?

- అటకెక్కిన తడి చెత్త–పొడి చెత్త పథకం
- ప్రజల్లో లోపించిన అవగాహన
- అమలులో జీహెచ్‌ఎంసీ వైఫల్యం


వీఎన్ కాలనీలో రోడ్డు మీదనే చెత్తాచెదారం, చెత్త కుప్పల పక్కనే పశువులు

నాంపల్లి: జీహెచ్‌ఎంసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తడి చెత్త–పొడి చెత్త పథకం ఆరంభ శూరత్వంగా మారింది. ఈ పథకం మీద సరైన ప్రచారం లేకపోవడంతో తడి, పొడి చెత్తను వేరు చేయకుండా అంతా ఒకటే చెత్త అన్నట్టుగా మారిపోయింది. ప్రారంభంలో ప్రతి ఇంటా తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా చెత్త బుట్టలను సైతం అందజేశారు. వీటి కోసం కోట్లాది రూపాయలను వెచ్చించారు. తొలినాళ్లలో ఇండ్లలో వేరు చేసిన చెత్తను తరలించేందుకు ఇంటి వద్దకే జీహెచ్‌ఎంసీ సమకూర్చిన చెత్త వాహనం వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. కొన్ని చోట్ల మినహా వంద శాతం చెత్త సేకరణలో జీహెచ్‌ఎంసీ వైఫల్యం చెందింది. ఈ పథకం అటకెక్కడంతో బస్తీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. రోడ్లపై చెత్తకుండీలు లేకపోవడంతో ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడే విసిరేస్తున్నారు. రోడ్ల మీద పేరుకున్న చెత్త గాలికి సమీపంలోని ఇండ్లలోకి వస్తోంది. రాకపోకలు సాగించే ప్రయాణికుల కళ్లలోకి దుమ్ము, ధూళి కణాలు చేరుతున్నాయి. ప్రధానంగా నాంపల్లి నియోజకవర్గంలో మల్లేపల్లి, రెడ్‌హిల్స్, అహ్మద్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లో చెత్త దర్శనమిస్తోంది. పేరుకున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆయా డివిజన్లలో పనిచేస్తున్న పాలకవర్గం నేతలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నామ్‌కే వాస్తే ఎస్‌ఎఫ్‌ఏ వ్యవస్థ..

- బస్తీల్లో పరిశుభ్రత రాజ్యమేలుతోంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది.
- మురికివాడల్లో మరింత దుర్గంధం వెదజల్లుతోంది. రోజు రోజుకూ పెరిగిపోతున్న చెత్తను శుభ్రం చేయడంలో ఎస్‌ఎఫ్‌ఏ వ్యవస్థతో పాటుగా పారిశుద్ధ్య కార్మికులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదనే అపవాదు వినిపిస్తోంది.
- వీధుల్లో పేరుకుపోతోన్న చెత్తను తరలించడంలో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్‌ఎఫ్‌ఏ) చురుకైన పాత్ర పోషించాల్సి ఉంది. కానీ వీరు కేవలం బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయించడానికే పరిమితం అవుతున్నారు. హాజరు వేయగానే ఆ ఏరియా నుంచి ఎస్‌ఎఫ్‌ఏలు జారుకుంటున్నారు.
- ఎస్‌ఎఫ్‌ఏ లేరన్న కారణంగా పారిశుద్ధ్య కార్మికులు పైపైనే చెత్తను ఊడ్చుతూ మమ అనిపిస్తున్నారు.
- వీధుల్లో ఊడ్చిన చెత్తను చెత్త కుండీల్లో వేయాల్సి ఉంది. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎస్‌ఎఫ్‌ఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఆసిఫ్‌నగర్ హుడా కాలనీ ఎస్‌ఎఫ్‌ఏను పిలిచి పేరుకుపోయిన చెత్తను చూపించి ఇదెవరు సాఫ్ చేయాలని ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న ఉన్నతాధికారులు సైతం ముక్కున వేలేసుకున్నారు.
- ఇదిలా ఉండగా మెహిదీపట్నం సర్కిల్–12 పరిధిలో 36 మంది ఎస్‌ఎఫ్‌ఏలు, 103 గ్రూపుల్లో పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు.
- వీటికి తోడు ప్రతి డివిజన్‌లో కార్పొరేటర్లు ఉన్నారు. వీరంతా ఏమి చేస్తున్నారో అర్థం కాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని మైసమ్మ ఆలయంలో శివ స్వాములు ఆదివారం పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జె.చిరంజీవి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఉషోదయ కాలనీ, జీహెచ్‌ఎంసీ, నవోదక కాలనీ ఫీడర్ల పరిధిలోని బాలాజీ నగర్, సత్యనారాయణ నగర్, మందుల గూడ, ఉషోదయ కాలనీ, ప్రియ కాలనీ, నవోదయ కాలనీ, పూల మార్కెట్, గుడిమల్కాపూర్, ఎస్‌బీఐ కాలనీ, ప్రియ కాలనీ, హీరా కాలనీ, మహేష్ నగర్, చైతన్య కళాశాల, హుడా కాలనీ, అలీనగర్, జయనగర్, నవోదయ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

రామ్‌సింగ్‌పురా, గంగానగర్, ఆగాపురా ఫీడర్ల పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కే.వి రామ్‌సింగ్‌పురా, గంగానగర్, ఆగాపురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సనా హోటల్, ఆర్యసమాజ్, ఎంసీహెచ్ పార్కు, తాళ్లగడ్డ, కమేళా గేట్, గంగానగర్, ఆగాపురా నాలా, సమాజ్ గ్రౌండ్స్, హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కే.వి సీతారామ్‌పేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సీతారామ్‌పేట్, ఏక్‌మినార్ మజీద్ లేన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ వెనుక లేన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

చార్మినార్: మీరాలం మండి రోడ్డులో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి పాతబస్తీకి రాకపోకలు సాగించడానికి మీరాలంమండి రోడ్డు ఎంతో కీలకమైంది. ఈ రోడ్డు నిత్యం భారీ వాహనాలతో పాటు ద్విచక్రవాహనాలు, కార్లు, జీపలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్నాయి. మీర్‌చౌక్ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ ప్రధాన రోడ్డులోనే నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సరైన ట్రాఫిక్ నియంత్రణ లేని కారణంగా గంటల తరబడి ట్రాఫిక్ జాం కొనసాగుతోంది. ఉన్నతాధికారులు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందంటున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మణికొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఏడో అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పలు విభాగాల్లో పోటీ పడి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. టి.విలాసిని, సి. హన్సివివక, గౌతమ్ కుమార్, తరన్‌రంగా, బి. ప్రేరణ, జి. వర్షిణి, కె. అన్విత్ బంగారు పతకాలు, టి. ఆదిత్య, జి.స హర్షిత, వై.ముని లక్షాయణరెడ్డి సిల్వర్ మెడల్స్ సాధించారని కోచ్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి


గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన పలువురు దరఖాస్తు దారులు

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుదారులకు గోషామహల్ నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలను అందించేలా కృషి చేస్తానని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పలు బస్తీలు, మురికివాడల దరఖాస్తుదారులు తమకు వెంటనే ఆరు గ్యారంటీలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాలు దరఖాస్తుదారులందరికీ అందేలా తమ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. తమ కార్యాలయంలో దరఖాస్తుదారులు సంప్రదిస్తే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ గోషామహల్ ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

ఘనంగా మోహిమ్ దక్షిణ్ విజయ ర్యాలీ


గోల్కొండ కోట వద్ద మోహిమ్ దక్షిణ్ విజయ ర్యాలీ


గోల్కొండ: శ్రీ శివ్ ప్రతిష్టాన్ యువ హిందుస్తాన్ ఆధ్వర్యంలో మోహిమ్ దక్షిణ్ విజయ ర్యాలీ ఆదివారం ఘనంగా జరిగింది. షాహియానత్ గంజ్ నుంచి బయలుదేరిన ర్యాలీ ఆదివారం సాయంత్రం గోల్కొండ కోటకు చేరుకుంది. ఛత్రపతి శివాజీ మహరాజ్ 350వ కోరోనేషన్ సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించామని ర్యాలీ ప్రతినిధి నితిన్ అన్నారు. 350 ఏళ్ల క్రితం శివాజీ మహరాజ్ అప్పటి కుతుబ్‌షాహీరాజు అబుల్ హసన్ తానీషాను కలవడానికి గోల్కొండ కోటకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోల్కొండ కోటలో ఇరువురి మధ్య సుదీర్ఘ సంభాషణ జరిగిందని ఆయన తెలిపారు. కాగా గోల్కొండ కోట వద్ద ర్యాలీగా వచ్చిన వారికి లోపల ప్రవేశించడానికి సెక్యూరిటీ సిబ్బంది అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దీంతో ర్యాలీ ప్రతినిధి ఎస్.రాజువస్తాద్ గోల్కొండ కోట పరిరక్షణ అధికారి నవీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. జెండాలు, ఇతర ప్రచార సామగ్రికి కోటలో అనుమతి లేదంటూ వాటన్నిటిని బయటనే పెట్టేసి టికెట్ తీసుకొని కోట లోపలికి వెళ్లాలని కోట పరిరక్షణ అధికారి తెలిపారు. దీంతో ర్యాలీలో పాల్గొన్న వారంతా టికెట్ తీసుకోని కోటలోకి వెళ్లారు.

'సాంకేతిక విద్యాబోధనలో అధునాతన మార్పులు'


జహీదా వసీమ్‌కు మెమొంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి

గోల్కొండ: సాంకేతిక విద్యాబోధనలో ఎన్నో అధునాతనమైన మార్పులు వస్తున్నాయని ఇండియా ఎడ్యుకేషనల్ సెల్స్ టీమ్ హెడ్ జహీదా వసీమ్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆమె మ్యాట్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈసీఈ, ఈఈఈ, ఈటీఎం విభాగాల విద్యార్థులకు మ్యాట్ ల్యాబ్ ఒక వరం లాంటిదన్నారు. జీఎన్‌ఐటీఎస్‌లో చదివిన విద్యార్థినులు దేశంలోని వివిధ రంగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని కళాశాల యాజమాన్యం వారికి అందిస్తున్న అత్యాధునిక సాంకేతిక విద్యాబోధన వల్లే ఇది సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి ఆమెకు మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో కళాశాల విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి


ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ షహానాకాతూన్

గోల్కొండ: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఉర్వా ఎడ్యుకేషనల్ ట్రస్టీ డాక్టర్ షహానాకాతూన్ అన్నారు. ఆదివారం గోల్కొండ నయాకీలాలోని ఉర్వా హైస్కూల్ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు క్రీడలతో పాటు చదువులో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్య మనిషిని సరైన దిశానిర్దేశం చేస్తుందన్నారు. నిరుపేద పిల్లలకు విద్యను అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని ఇందులో భాగంగానే నిరుపేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో పాఠశాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉర్వా ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ షహబూద్దీన్ సుబాలీ, పాఠశాల అకాడమిక్ హెడ్ అమీనా తస్నీన్, హుమ్రం హాఫ్మీ, హిఫ్సత్ తయ్యబా పాల్గొన్నారు.

పీఎంజేలో 11 వరకు ఎగ్జిబిషన్



అబిడ్స్: పీఎంజేలో ఫిబ్రవరి 11వ తేదీ వరకు జ్యువెలరీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని పీఎంజేలో ఎగ్జిబిషన్‌ను జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. 11వ తేదీ వరకు వివిధ రకాల వెడ్డింగ్ జ్యువెలరీ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంజే జ్యువెల్స్ క్లస్టర్ హెడ్ కుసుమ కిరణ్, స్టోర్ హెడ్ మహ్మద్ తాహీర్ పాల్గొన్నారు.

గండి మైసమ్మ ఆలయంలో పూజలు


పూజల్లో రవీందర్, లచ్చుగుప్తా, సూర్యప్రకాష్ శుక్లా తదితరులు

అబిడ్స్: గండిమైసమ్మ ఆలయంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి జి.రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందుకు ఆదివారం గండిపేట గండిమైసమ్మ వద్ద ఆయన పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ..పదేళ్ల కేసీఆర్ నిరంకుశ పాలనలో ప్రజలు పలు రకాల వేధింపులకు గురయ్యారన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ పూజా వేడుకల్లో రాష్ట్ర బజరంగ్‌దళ్ అధ్యక్షుడు లచ్చుగుప్తా, సూర్యప్రకాష్ శుక్లా, సీహెచ్. ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు రవీందర్ సింగ్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రమణీయం.. సంయుక్త నాట్యం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కూచిపూడి నృత్య పాఠశాల అభినయవాణి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నృత్య గురువు బాలాత్రిపుర సుందరి శిష్యురాలు సంయుక్త కూచిపూడి రంగప్రవేశం ఆదివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్య, హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, డాక్టర్ స్వర్ణలతరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మహ్మద్ షబ్బీర్ అలీని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి



చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు చురుగ్గా పాల్గొన్నాలని చైతన్య యూత్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పాతబస్తీ దారుషిఫాలోని రైన్ బో హోం విద్యార్థులకు స్వయంగా హెయిర్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని..ఇందులో భాగంగా విద్యార్థులకు ఉచితంగా కటింగ్ చేయడం జరిగిందన్నారు.

ఐఎన్‌టీయూసీకి టికెట్ కేటాయించాలి


గాంధీభవన్‌లో దరఖాస్తు ఫారాన్ని చూపుతున్న గుంజ శ్రీనివాస్

గన్‌ఫౌండ్రీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విభాగానికి ఒక టికెట్‌ను కేటాయించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ టీపీసీసీని విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టీయూసీ తరఫున ఆదివారం గాంధీభవన్‌లో మల్కాజ్‌గిరి స్థానానికి దరఖాస్తును సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కేటాయింపులో ఐఎన్‌టీయూసీని విస్మరించారని, లోక్‌సభ ఎన్నికల్లో కార్మిక విభాగానికి ఒక టికెట్‌ను కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐఎన్‌టీయూసీకి బలమైన బలగం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణుకా, అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'కూచిపూడి నృత్యాంజలి'



నాంపల్లి: అమృత ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు ఆదివారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యాంజలి శీర్షికన ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నృత్య గురువు సాయిగీత పర్యవేక్షణలో నిజాంపేట, కూకట్‌పల్లి, మియాపూర్, సర్దార్ పటేల్ నగర్ బ్రాంచ్‌లకు చెందిన సుమారు 200 మంది శిష్యులు నర్తించారు. తాండవనృత్యకరీ, భామా కలాపం, గోవర్ధనగిరి, జతిస్వరం, దశావతార శబ్దం వంటి అంశాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. అనంతరం శిష్యులకు నాట్య కుసుమం అనే బిరుదుతో సత్కరించడం జరిగిందని అమృత ఆర్ట్స్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ శేషుకుమార్ తెలియజేశారు.